వైసిపి కొట్టుకుపోవడం ఖాయం : టిడిపి

రాయచోటి: వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయని పేర్కొన్నారు. టిడిపి హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.1500, జగన్ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.ఆరు వేలు పెంచి అమ్ముతున్నారని ఈ విధంగా పేద ప్రజలు కడుపు కొట్టి సంపాదించి వైసిపి నాయకులు తమ ఖజానా నింపుకుంటున్నారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డికి సంవత్సరానికి రూ.15 వేల కోట్ల ఇసుక ద్వారా వారి ఖజానా నింపుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక దొరక్క పనులు లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని వాపోయారు. ఇసుక బంగారంగా మారిందని చెప్పారు. ఒకపక్క పన్నుల మోత మోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరొకపక్క నిత్యవసర సరుకులు ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని అన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు చూస్తే పేదలు తమ సంపాదన మొత్తం బిల్లుకే కట్టే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మహిళలను రకాలుగా మోసం చేశారని చెప్పారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి, ప్రచార కార్యదర్శి మహ బూబ్ అలీఖాన్, మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మైనార్టీ సెల్ కార్యదర్శి మల్బూర్, బిసి సెల్ కార్యదర్శి రామాంజి పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లాలోని జాతీయ రహదారుల భూసేకరణ అంశంపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో జెసి ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న నాలుగులైన్ల జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎంత భూసేకరణ జరిగింది, ఇంకా ఎంత జరగాల్సి ఉంది, పరిహారం చెల్లింపు, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల జారీ తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఫైల్స్ పెండింగ్ లేకుండా ఆయా అంశాల వారీగా ఆర్డీవోలు, తహశీల్దార్లతో చర్చించి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కారాన్ని ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాజంపేట, నందలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లిలో మండలాల వారీగా ఎన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత చెల్లింపులు చేయాల్సి ఉందన్న అంశంలో ఆయా తహశీల్దార్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరికి సంబంధించిన చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించి కోర్టులో కేసులుంటే ఆయా సర్వే నెంబర్లకు సంబంధించి డబ్బు కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించారు. సేకరించిన భూమిలో ఏవైనా స్ట్రక్చర్స్ ఉంటే వాటిని గుర్తించి త్వరితగతిన ఫైనలైజ్ చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. రైల్వే, అటవీ పోరంబోకు, జెడ్‌హెచ్‌డిసి భూములకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కగా పాటించాలన్నారు. ఏ అవార్డుకు ఎంత నగదు చెల్లింపు చేశారన్న వివరాలను పక్కగా నమోదు చేయాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో పురోగతి కనిపించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

జిల్లాలోని అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలని కలెక్టర్ గిరీష అధ్యాపకులకు సూచించారు. స్పందన హాల్లో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో పనిచేస్తున్న ఒప్పంద డిగ్రీ అధ్యాపకుల సర్వీస్ రెన్యువల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 46 మంది ఒప్పంద డిగ్రీ అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. వీరందరూ మంచి విద్య బోధన చేసి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. అధ్యాపకులు నిబద్ధతతో పనిచేసి డిగ్రీ కళాశాల అభివృద్ధికి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధ్యాపకుల పనితీరును ఫలితాలను సమీక్షించి 46 మంది ఒప్పంద డిగ్రీ అధ్యాపకుల సర్వీస్‌ను 2023-24 విద్యా సంవత్సరానికి గాను రెన్యువల్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐడి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపళ్లు, ఒప్పంద అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలకొండలో చిరుత పులి సంచారం

- ఆందోళనలో గొర్రెలకాపర్లు, వాహనదారులు
- అటవీ శాఖ సిసి కెమెరాల్లో చిత్రాలు లభ్యం

సిసి కెమెరాల్లో కనిపించిన చిరుత సంచారం

పాలకొండలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వలచెరువు పరిధిలోని తూర్పు పాలకొండ, ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలోని లోయల్లో చిరుత పులి పిల్లలుతో సంచారం చేస్తున్నట్లు గొర్రెలకాపర్లు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కడప-రాయచోటి గువ్వలచెరువు ఘాట్ రోడ్డుపై ద్విచక్ర వాహనాల దారులు, ప్రజలు, బాటసారిలు ఈ దారిలో నడవాలంటే బెంబెలెత్తిపోతున్నారు. పాలకొండలోని పపిరెడ్డికుంట. విప్లమడ పరిసర ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సిసి కెమెరాలలో చిరుతలు సంచారం చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు పేర్కొంటున్నారు. కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్లోలోని కోనేటి వద్ద కొలను వద్ద చిరుత తమ పిల్లలతో నివాసముండి సంచారం చేస్తున్నట్టు గొర్రెల కాపర్లుకు కనిపించినట్లు చెబుతున్నారు. ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు గగ్గోలమంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చిరుతలను పట్టుకొని వాటిని అదుపు చేయాల్సిన బాధ్యత ఫారెస్ట్ అధికారులకు ఎంతైనా ఉందని ప్రజలు తెలుపుతున్నారు. ఈ పాలకొండలు దట్టమైన అడవులు. చెట్లు పెరగడంతో మరోపక్క కొండలు, పెద్దపెద్ద ప్లేట్లు బండలు లోయలు అధికంగా ఉండడంతో అవి వాటినీ నివాసంగా ఏర్పరచుకొని కొండ పరిసర ప్రాంతాల్లో సంచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై బీట్ ఆఫీసర్ గాయత్రిని వివరణ కోరగా తమ ఫారెస్ట్ పరిధిలోని పప్పిరెడ్డి కుంట విప్లమడ ప్రాంతాల పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. చిరుతలు తిరుగుతున్నట్లు ఫొటోలో కనిపించినట్లు చెప్పారు. గొర్రెలకాపరులు, ప్రజలు పాలకొండల ప్రాంత పరిధిలోకి వెళ్లవద్దని సూచించారు.

ధీనావస్థలో గంగపుత్రులు

- మత్స్యకారుల బతుకులు మారేదెన్నడో?
- పథకాలు అంతంత మాత్రమే
- వర్షాభావంతో ఎండుతోన్న చెరువులు
- కనుమరుగవుతున్న వృత్తి

చేపలు పడుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - రాయచోటి

నేతలు మారినా తమ రాతలు మారలేదంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎవరో వస్తారు ఏదో చేస్తారంటూ ఎదురు చూసి మోసపోకుమా' అనే సామెత ప్రకారం ప్రభుత్వాలు మారుతున్న కానీ మత్స్యకారుల జీవనం.. వారికి ప్రభుత్వ పథకాలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం గంగపుత్రులకు ఆదుకుంటున్నామని పేపర్లకే ప్రకటనలు చేస్తుందే తప్ప చేతల్లో చూపిన దాఖలాలు లేవంటూ మత్స్య కారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో 144 చెరువులు, 5 ప్రాజెక్టులు, దాదాపు 835 మత్సకారులున్నారు. ఇటీవల కొంతకాలంగా వర్షాలు లేకపోవడంతో ఉన్న చెరువులన్నీ ఎండిపోవడంతో మత్స్యకారుల జీవనం దుర్భరంగా మారింది. ప్రభుత్వం మత్స్యకారులకు వలలు, పడవలు, పెన్షన్లు ఇచ్చి ఆదుకుంటామని ప్రకటనలు మాత్రం గుప్పిస్తోంది. వాస్తవంగా అందుకు పూర్తిగా ఉంది. జిల్లాలోని పలు చెరువులు నీరు లేకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి. ఇక చిన్న చిన్న ప్రాజెక్టుల్లోనూ అంతంత మాత్రమే నీరు ఉండడంతో అక్కడ చేపలు పట్టుకొని జీవనం సాగించే వారిపై అధికారులు కొరడా చిలిపిస్తూ కేసులు పెట్టడంతో వారి పరిస్థితి మరి దయనీయంగా మారింది.

బయట ప్రాంతాల నుంచి భారీ ఎత్తున మార్కెట్లోకి చేపలు రావడంతో ప్రజలు వాటిపై మొగ్గు చూపుతుండంతో స్థానిక మత్సకారులు పట్టిన చేపలకు డిమాండ్ తగ్గింది. పైగా వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో మత్స్యకారులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి లబ్ది చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మత్స్యశాఖ కారులకు వలలు, పడవలు ఇతర పరికరాలు ఉచితంగా సరఫరా చేయాలి. ప్రతి ఒక్కరికి చేపలు ఇన్సూరెన్స్ కార్డులను మంజూరు చేయాలి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో చేపలు మార్కెట్ ను ఏర్పాటు చేయాలి. పెన్షన్ కూడా మంజూరు చేయాలి.

- వేణుగోపాల్, మత్స్యకారుడు, రాయచోటి.

లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలి

చేపలు పట్టే వారు లైసెన్స్‌ను తప్పనిసరిగా తీసుకోవాలి .రాష్ట్ర ప్రభుత్వం చేపల మార్కెటింగ్ షాపులకు ఎస్సీ, ఎస్టీ , మహిళ కు 60 శాతం, బీసీకి 40 శాతం సబ్సిడీతో రూ. లక్ష నుంచి రూ. 50 లక్షల వరకు మంజూరు చేస్తుంది. చేపల అమ్మకదారులకు వాహనాలు కూడా ద్విచక్రవానం, మూడు చక్రాల వాహనం, నాలుగు చక్రాల వాహనాల కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీకి 60 శాతం, బీసీకి 40 శాతం సబ్సిడీతో అందజేస్తున్నాం. మండల, స్థాయి గ్రామ సచివాలయం సిబ్బందితో మత్స్య కారులకు పలు సూచనలు,సలహాలు కూడా అందజేస్తున్నాం.

- ఎన్.సుష్మిత, జిల్లా మత్స్యశాఖ అధికారి, రాయచోటి.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బియ్యం ఇతర సామగ్రి డీలర్ల నుంచి స్కూల్‌కు రవాణా ఛార్జీలు లేనందున ప్రభత్వమే పాఠశాలకు సరఫరా చేయాలన్నారు. రాగిజావా పాయిసం వండినందుకు ఎటువంటి డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఏజెన్సీల వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని చెప్పారు. కూరలు చేయాలన్నా ఇబ్బందులన్నాయని, ప్రతి విద్యార్థికీ మెనూ చార్జీలు రూ.8 నుండి రూ. 20 వరకు పెంచాలన్నారు. ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో విద్యాసంస్థలు మెర్జ్ చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, వారికి ఉపాధి చూపించే భాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వంటపాత్రలు గ్యాస్ సరపరా ప్రభుత్వమే చేయలన్నారు. గుర్తింపు కార్డులివ్వాలన్నారు. మూడు నుంచి నాలుగు నెలల పెండింగ్ బిల్లులతో పాటు ప్రతి నెలా సకాలంలో బిల్లులు వేతనాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు రఫీ, అక్బర్, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, అనసూయ పాల్గొన్నారు.

సంక్షేమ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మిథున్‌రెడ్డి, మేడా

ప్రజల అభ్యున్నతే సిఎం ధ్యేయం

- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర ప్రజల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆలకేపాటి అమర్నాథ్‌రెడ్డి మండల పరిధిలోని మందపల్లి పంచాయతీలోని వడ్డిపల్లి, అరుంధతివాడ, శేషమాంబపురం పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లె, కోపురాజుపల్లె గ్రామాలలో పర్యటించారు. సిఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలకు సంబందించిన పుస్తకాలు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. మూడు సంవత్సరాల పాలన అనంతరం గడపగడపకూ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఎమ్మెల్యే నుంచి వాలంటీర్ వరకు నేరుగా ప్రజల చెంతకే వెళ్లి ప్రజలను పలకరిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరికైనా ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గ్రామాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. బాజిరెడ్డిగారిపల్లి, కోపురాశిపల్లి గ్రామాలలో విద్యుత్ స్తంభాలు, రహదారులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరగా తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆకేపాటి మురళీరెడ్డి,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మానవత స్వచ్ఛంద సంస్థ, ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కలాశాల విద్యార్థులు పట్టణంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ ఆర్అండ్‌బి బంగ్లా నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఎవిఆర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విడిదిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున కె.రాముడు, టి.రమణారెడ్డి, ఎస్.అబ్దుల్లా, కె.సురేష్, వై.నంద కిషోర్, ఎన్.శివరాజ్, బి.రామచంద్ర నాయుడు, బి.శ్రీనివాసులు నాయుడు, వేణు గోపాల్ నాయుడు, చంగయ్య, రామయ్య, కడప పట్టణ అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ఇసి సభ్యులు కె.దేవానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా సంస్థ విలువలే ప్రాతిపదికగా ఏర్పడిందన్నారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతాలకతీతంగా సాటి మానవునికి సహాయం చేయాలనే ఉద్దేశంతో ఏర్పడిన సంస్థ అని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : జెసి

లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- రాయచోటి

ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసు కోవాలని జెసి ఫర్మాన్ అహ్మన్ పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం విసి హాలు నిర్వహించి నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి లబ్ధి అందించడంలో భాగంగా సిఎం బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జెసి హాజరై విసి అనంతరం మాట్లాడారు. నవరత్నాలు - ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులైన వారందరికీ నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమం ద్వారా జిల్లాలో 19,003 మంది లబ్ధిదారులకు గాను రూ.6.98 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు.ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ జిల్లాలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా 20 మంది లబ్ధిదారులకు 4.80 లక్షలు, ఎస్ఐఆర్ ఇబిసి ద్వారా 383 మందికి 57.45 లక్షలు, జగనన్న చేదోడు ద్వారా 1123 మందికి రూ.112.30, జగనన్న అమ్మఒడి ద్వారా 622 మందికి రూ. 93.30 లక్షలు, వైయస్సార్ ఆసరా ద్వారా 50 మందికి రూ. 15.18 లక్షలు, జగనన్న విద్యా దీవెన ద్వారా 2002 మందికి రూ.248.14 లక్షలు, జగనన్న వసతి దీవెన ద్వారా1734 మందికి రూ.152.44 లక్షలు, వైయస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా275 మందికి రూ.15.01 లక్షలు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇందులో రైస్ కార్స్7249 మందికి, ఆరోగ్యశ్రీ కార్డులు 1588 మందికి, హౌస్ సైట్ పట్టాలు 12794 మందికి ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పయాజ్ బాష, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయోత్సాహ సంబరాలు

రాయచోటి : విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-రాయచోటి

చంద్రయాన్-3 విజయవంతంతో సంబరాలు జరుపు కుంటున్నారు. జిల్లాలోని పలు చోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, రాజకీయ పార్టీల నాయకులు సంబరాలు చేసుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో భారత అంతరిక్ష కేంద్రం ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా గురువారం పట్టణంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు భారత అంతరిక్ష కేంద్ర శాస్త్రవేత్తలను అభినందిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయం సాధించడంతో భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచంలో అగ్రస్థానానికి చేరిందని, చందమామ దక్షిణ ధ్రువం పై ప్రథమంగా రోవర్‌ను పంపిన ఘనత భారతదేశానికి దక్కిందని అభిప్రాయపడ్డారు. చంద్రయాన్-3 ప్రయోగంలో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి తద్వారా భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు:** పిల్లలు బాగా చదువుతూ విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంచుకుంటూ శాస్త్రజ్ఞులుగా ఎదగాలని విఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత వడ్లమూడి మాధవి తెలిపారు. గురువారం స్థానిక విఎస్ఎన్ సిద్ధార్థ స్కూలులో చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ కరస్పాండెంట్ మాధవి కేక్ కట్ చేసి విజయోత్సాహాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో భారతదేశం అగ్రస్థానంలో నిలవడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. విఎస్ఎన్ సిద్ధార్థ ఒలంపియాడ్ ప్రోగ్రామ్‌లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు తమ సృజనాత్మక శక్తికి పదును పెడుతూ, విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని చూపుతూ శాస్త్రజ్ఞులు కావాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేష్, అకాడమిక్ ఇన్‌ఛార్జి బాబురెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు గణపతి, శివ, జనార్ధన్‌రెడ్డి, రజని, రేఖ చంద్రయాన్-3 విశిష్టత గురించి వివరించారు. అనంతరం భారతదేశ జాతీయ పతాకానికి వందనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** చంద్రయాన్-3 మిషన్ దిగ్విజయం కావడంతో పట్టణంలో విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు పట్టణ పురవీధుల్లో మహార్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ మనూజ ముఖ్యఅతిదులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రెడ్డి రాణి, బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్, కురువంక సర్పంచ్ పసుపులేటి చలపతి, డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, గుడ్ విల్ కంప్యూటర్స్ అధినేత అజయ్ కుమార్, సాయి శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎండియు ఆపరేటర్లు

ఎండియు ఆపరేటర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పీలేరు

ఎండియు ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దారు సుబ్రమణ్యంకు వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం మండల పరిధిలోని ఎండియు ఆపరేటర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ చౌక దుకాణాల నిత్యావసర సరుకుల వినియోగదారుల నుంచి రెండుసార్లు వేలిముద్రలు తీసుకుని రేషన్ పంపిణీ చేయడం వల్ల హెల్పర్ల సమస్య తిరిగి మొదటికి వచ్చిందన్నారు. దీంతో అదనపు పని భారం పెరిగి రాగులు, బియ్యం రెండుసార్లు తూకాలు వేసి ఇవ్వడానికి అదనపు కూలీ అడుగుతున్నారని చెప్పారు. దీంతో ఎండియు ఆపరేటర్లు ఇబ్బందులకు గురౌతున్నారని తెలియజేశారు. తమకు వస్తున్న జీతం నుండి హెలర్లకు రూ.7 నుండి రూ.9 వేల వరకు చెల్లిస్తున్నామని అన్నారు. ఫలితంగా తమకు రూ.5 నుండి రూ.7 వేలు మాత్రమే మిగిలుతోందన్న ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు కారణంగా మండలాల్లో ఎండియు ఆపరేటర్లు రాజీనామాల బాట పడుతున్నారని చెప్పారు. పెరిగిన పెట్రోలు, నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా తమ వేతనాలను కూడా పెంచేలా తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియపరచాలని రెవెన్యూ అధికారికి విజ్ఞప్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు. కొత్తగా వచ్చిన సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం రూ.లక్ష కల్పించిందని తెలిపారు. వారి కన్నా తాము ఎక్కువ రిస్క్ తీసుకుంటున్నామని తమకు రూ.10 లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తమ వంతు సహకారాన్ని కూడా అందించిన, అందిస్తున్న ఎండియు ఆపరేటర్ల కష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించాలని కోరారు. జగనన్న ఆశయ సాధన కోసం పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మనవి చేసుకున్నారు. ముఖ్యంగా ఎండియు వాహనాలకు సంబంధించి ఫిట్నెస్ సర్టిఫికెట్టులకు అదనంగా చార్జీలు వసూలు చేయకుండా ఆర్.టి.ఓ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని, తూనికల శాఖ ద్వారా ఖాటాల లైసెన్సు రెన్యూవల్ చేయించాల్సిందిగా తాము కోరుతున్నామన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వానలు లేక అల్లాడుతున్నా జీవరాసుల మనుగడ కోసం అపారంగా వర్షాలు కురువాలని, సమస్త మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ వాన రాక కోసం ముస్లిమ్ మైనార్టీలు ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం పట్టణంలోని మౌలానా భఖ్తియారి చౌక్ వద్ద ముస్లిం మైనారిటీలు ప్రత్యేక ప్రార్థనలు(దువా) చేశారు. దువా అనంతరం 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల మైనారిటీ నాయకులు, ప్రముఖ వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని చలంపాలెం గ్రామం చెందిన గూడూరు రాజేష్ అనారోగ్యంతో వేలూరులో సిఎంసిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ తరుపున లక్ష రూపాయలు బాధితుడు కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు.అభాగ్యులను, ఆసరాలేని వారికి అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, రమణరాజు, రమేష్‌రాజు పాల్గొన్నారు.

నేడు పాఠశాలకు సెలవు

ప్రజాశక్తి-కలకడ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలకు శుక్రవారం సెలవు ప్రకటించినట్లు ఎంఇఒ మునీంద్రనాయక్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు వరలక్ష్మి వ్రతం సందర్భంగా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు ప్రవేశపెట్టిన ఐచ్చిక సెలవులను భాగంగా వరలక్ష్మి వ్రతం పండుగ సందర్భంగా రెండవ సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో తప్పనిసరిగా శుక్రవారం సెలవు దినంగా ప్రకటించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించి పాఠశాలలో నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

ప్రజాశక్తి-పుల్లంపేట

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి రానున్నట్లు ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, మండల కన్వీనర్లు, సర్పంచులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రన్నింగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎడిఆర్‌ఎం సుధాకర్

రైల్వే కేంద్రంలో ఎడిఆర్‌ఎం తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో గుంతకల్ అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎడిఆర్‌ఎం) యు.సుధాకర్ గురువారంతనిఖీ చేశారు. రైల్వేస్టేషన్, రన్నింగ్‌రూమ్, ఆర్‌పి ఎఫ్ బ్యారక్, క్రూబుకింగ్ లాబీ, స్టేషన్ మాస్టర్ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. ఎడిఆర్‌ఎం వెంటన సీనియర్ డిఇఇలు వీరయ్య, నాగరాజు, డిఇఎన్ సౌత్ అభిరామ్, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బిసివి.రాజు, ఎఎస్‌టిఇ కార్తికేయ, సీనియర్ లోకో ఇన్స్పెక్టర్ పెంచలయ్య, సిసిసి వేణుగోపాల్, ఐఒడబ్ల్యు రమణరావు, పిడబ్ల్యుఐ సురేష్ బాబు, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ చంద్రనాయక్, అధికారులు పాల్గొన్నారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామంలోని అలకన్ చెరువు బురుజుపల్లిలో ఏర్పాటు చేసిన సీతారామ చంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నట్లు కార్యని ర్వాహకులు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఈ ధ్వజ స్తంభం ప్రతిష్టకు డాక్టర్ కాలువపల్లి జయశంకర్‌రెడ్డి దంపతులు సమర్పిస్తారని, వారి చేతిలో మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమానికి హజరయ్యే ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.గ్రామంలోని ప్రజలు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

రక్షక తడితో వేరుశనగను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

రక్షక తడితో ఎండుతున్న వేరుశెనగను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.మురళీధర్ పేర్కొన్నారు.వర్షాలు సకాలంలో కురవక పోవడంతో వేరుశెనగ సాగుచేసిన రైతులు పంట ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. పంటకు నీరందనప్పుడు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు వివరించారు. మండలంలో వేరుశెనగ పంటలకు వర్షం అనుకూలించక ఇబ్బందులు పడుతున్న రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఇటీవల ఖరీఫ్‌లో వర్షానికి బోర్ల కింద వేసిన వేరుశనగ పంట చివరి దశలో ఉందని, వర్షం రాకపోవడంతో పంట ఎండుతున్నట్లు రైతులు తమ దృష్టికి తీసుక వచ్చారని అన్నారు. రైతుల సూచనల మేరకు పంటలను పరిశీలించినట్లు చెప్పారు. ఎక్కడైతే వేరుశనగ పంట ఎండిపోతున్నదో అక్కడ నివారణ చర్యలకు రైతులకు సూచనలు, సలహాలు అందించామన్నారు. గాను 200 లీటర్ల నీటికి నాలుగు కేజీలు యూరియా కలుపుకొని పిచికారి చేయాలని రైతులకు సూచించామన్నారు. ఇలా చేసినట్లయితే పంటను 10 నుంచి 15 రోజులు వరకు కాపాడుకోవచ్చని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి ట్యాంకర్లతో నీరు తోలుకొని రక్షకతడి పంటకు ఇచ్చి పంటను కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే వేరుశెనగ ఎండిపోకుండా కాపాడుకోవచ్చని ఎవో తెలిపారు. రైతులు సూచనలు పాటించాలన్నారు

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE :: PILER

O.S.NO. 61 of 2017

Smt Kambella Yellamma. ...Plaintiff

Vs

Sri Kambella Siddaiah & 19 Others. ...Defendants

SUMMONS TO THE DEFENDANT NOS. 9, 11 & 16

To,
D-9). Kambella Dhana Lakshmi, D/o Yerraiah,
D-11). Bandi Madhusudhana Reddy, S/o Subba Reddy,
D16). Tellamekla Rama Murthy, S/o Reddeppa,
All are R/at Kuravapalle Village, H/o Vepulabylu, Piler Mandal, Annamayya District.

Where as the above named plaintiff filed the above suit for partition of plaint schedule properties into two equal shares and allot one such share to the plaintiff and for permanent injuction restraining the defendants 1to9 from executing any sort of documents of any nature in respect of the plaint schedule property and the same is hereby posted to 28.08.2023 for your appearance. Hence, you are hereby summoned to attend either personally or through a pleader and represent your case, else the matter will be decided as ex-parte.

//By Order of the Honourable Court//

A.NARASIMHA REDDY, B.Com., B.L.,
Advocate for Plaintiff,
PILER. Cell: 9440589103.

IN THE COURT OF THE DISTRICT JUDGE OF CHITTOOR

Crl.M.P.No. 348 of 2023

Between:
Bandi Hari Babu ...Petitioner
And:
Bandi Lakshmidevi ...Respondent

NOTICE TO RESPONDENT

To:
Bandi Lakshmi Devi
W/o Bandi Hari Babu,
residing at Thana Vaddipalli,
H/o Mudupulavemula Village & Post,
Piler Mandal,
Chittoor District
(Presently Annamaiah District)

Madam, Please take notice that the above Crl.M.P filed against and same is posted to 18-09-2023 for your appearance. Hence you are directed to appear before the above said court on 18-09-2023 at 10-30 A.M either in person or through your Advocate and file your objection if any, otherwise the matter will decided according to the law.

Sd/-A.DEVENDRANATH
Advocate for Petitioner, Chittoor

ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజలకు అన్నివిధాలా మేలు చేకూర్చడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బడికాయలపల్లి పంచాయతీ, వలసగుట్లపల్లి గ్రామంలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల పనితీరు బేషుగ్గా ఉందని, ఎప్పటికప్పుడు స్పందించి ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చేశారన్నారు. అదేవిధంగా ప్రజలు యోగక్షేమాలు తెలుసుకొని వారి అవసరాలు తీర్చాలని అధికారులను ఆదేశించారు. బడికాయలపల్లె పూర్తయిన గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, ఎంపిపి లక్ష్మీనరసమ్మ, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, వైస్ ఎంపిపి రాధా, సర్పంచ్ ఆదెప్పగౌడ్, ఎంపిటిసి సుబ్బయ్య నాయుడు, ఎంఇఒ రెడ్డిశేఖర్, ప్రభుత్వాసుపత్రి కమిటీ డైరెక్టర్ కంచి కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అరుణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కార్యదర్శి మస్తాన్, వైసిపి నాయకులు రమేష్‌నాయుడు, కో-ఆప్షన్ నాసర్, పవన్, మహేష్ తెలిపారు.


పల్లెబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని బండ్లపై గ్రామంలో సీజనల్ వ్యాధులపై ఎంపిపినరసింహులు, స్థానిక నాయకులు చంద్రమోహన్ సహకారంతో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఫీవర్‌సర్వే, యాంటీ లార్వ ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. దోమల నివారణకు ద్రావణాన్ని పిచికారి చేసినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పై, దోమ కాటువలన వచ్చే మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పాటించాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు ఎక్కువ రోజులు నిలువ లేకుండ చూడాలని, దోమ లార్వాను నియం త్రించాలని సూచించారు. దగ్గు, జ్వరం, ఇతర జబ్బులు వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి ఖలీల్, సూపర్వైజర్ దేవేంద్ర, శాంతి, సాలమ్మ పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయంపై సంబరాలు

ప్రజాశక్తి-సుండుపల్లి

చంద్రయాన్-3 విజయంపై మండల వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. మండలంలోని సుంటెపల్లి గ్రామపంచాయతీలో భైరవగుట్ట కస్తూరిబా స్కూల్లో మండల నాయకులు రామస్వామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్ర మంలో ఎం.పి.పిరాజమ్మ, జెసిఎస్ కన్వీనర్ రెహ్మాన్ ఖాన్, రాయవారం సర్పంచ్ చోటు, మధుసూదన్ రెడ్డి, యరపురెడ్డి ఆనంద్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బిసి స్టేట్ డైరెక్టర్ రాజు, ఎంపిటిసిలు నసీమ బాను, చంద్రమౌళీశ్వరస్వామి ఆలయచైర్మన్ శంకర్, రెడ్డివారిపల్లి సర్పంచ్ శ్రీనివాసులు, ఖాదర్‌వలీ, కాలువ ఉపసర్పంచ్ రఫీ, హరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** చంద్రయాన్-3 చంద్రుని పై విజయవంతంగా దిగడంతో చదివేవాడ్లపల్లి హై స్కూల్ విద్యార్థులచే వైసిపి నాయకులు ఇందిరమ్మకాలనీ నుంచి క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఇటువంటి గొప్ప ప్రయోగాలతో భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి ఇస్రో సైంటిస్టులకు సంఘీభావం తెలియజేస్తూ జయహో భారత్ నినాదాలు చేస్తూ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎంఐ హనీఫ్, అజయ్, వేంపల్లి ఖాదర్‌బాషా, ప్రధానోపాధ్యాయులు సంపత్‌కుమార్ వైసిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** చంద్రయాన్-3 విజయవంతం చంద్రునిపై దిగడం భారతదేశం గర్వించదగ్గ విషయమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫు మొహిద్దిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్-3, చంద్ర మండలం పై విజయవంతం గా అడుగు పెట్టడం భారతదేశ శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని, హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలు యాభై ఏళ్ల అనుభవం ఉన్నప్పటికీ వారి ప్రయోగాలు విఫలమయ్యాయని అన్నారు. చంద్రయాన్-3 విజయవంతమై దేశానికి గొప్ప కీర్తిని సంపాదించినందుకు భారత ఇస్రో సిబ్బందిని అభినందించారు. ఈ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. **ములకలచెరువు :** చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ములకలచెరువు బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ములకలచెరువు పురవీధుల్లో విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమెరికా, రష్యా, చైనా తరువాత జాబిల్లిపై చంద్రయాన్-3 అడుగుపెట్టిన ఘనత దేశాన్ని వరించిందన్నారు. భవిష్యత్తులో ఇస్రో శాస్త్రవేత్తలు మరిన్ని ప్రయోగాలు చేపట్టి భారతదేశాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కొత్తకోట :** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రునిపై అడుగిడిన తొలిదేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిం దన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల సామర్థ్యాన్ని ప్రపంచ దేశాల వారు కొనియాడడం గర్వకారణ మన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్ అనే నినాదాలతో పురవీధులు మారుమోగాయి. కార్యక్ర మంలో ఉపాధ్యాయుల నాగరాజ, వెంకట రమణారెడ్డి, మురళీధర్, భాస్కర్ రెడ్డి, రామాంజులు, సుజాత, నక్కా మహేష్, పీడీ తాజ్ బాషా పాల్గొన్నారు.

సుండుపల్లిం : కేక్ కట్ చేసి సంబరాల జరుపుకుంటున్న నాయకులు, విద్యార్థులు

కలికిరి : విజయోత్సవ ర్యాలీలో విద్యార్థులు

వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం పరిధిలోని పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు చెల్లించాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికులకు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని కోరారు. యూనిఫామ్ పిఎఫ్, ఇఎస్ఐ, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలను మండలంలో అన్ని పంచాయతీల్లో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శేఖర్‌నాయక్, సుధాకర్, ఓబులేసు, నాగేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, మాతృ, శిశు మరణాలు సంభవించ కూడదని, బయట ఉన్న విద్యార్థులను వంద శాతం పాఠశాల , కళాశాలకు మళ్లీ వచ్చి చేరాలని ఆ విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ జిల్లాలో బడి బయట ఉన్న విద్యార్థులను వెంటనే తిరిగి పాఠశాలలో కళాశా లలో చేర్పించేందుకు చాలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సమాచారం ముందస్తుగా గ్రామాలలో తెలియపరచాలని ఆ కార్యక్రమంలో బాల్యవివాహాలు, చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం మంచిది కాదని ప్రజలను ఉద్దేశించి మాట్లాడాలని తెలిపారు. ముప్పై సంవత్సరాల పైన ఉన్న అందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి బి.పి. , షుగర్ వ్యాధులు నియంత్రణ లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.హై రిస్క్ గర్భిణులకు ముందస్తుగా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి ప్రసవాలు జరిగే లాగా చర్యలు తీసుకోవాలని, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు వినియోగించుకోవాలని సూచించామన్నారు.

నాడు - నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని, వాలంటీర్ల ఖాళీలు పూరించటానికి మున్సిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సిఇఒలు చర్యలు తీసుకోవాలని, సిటిజెన్ సెంటర్‌లు పని చేయించాలని, వైయస్సార్ బీమా పొందడానికి లబ్ధిదారులకు కావలసిన సర్టిఫికెట్లు వెంటనే ఏర్పాటు చేసి వారికి బీమా వర్తించే విధంగా చేయాలని కోరారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సెప్టెంబర్ 17న ప్రారంభిస్తున్నారని, అందుకుగాను 18 రకాల కళాకారులు అనగా బంగారు పని చేసేవారు , కుమ్మరి పని , బోట్లు తయారు చేసేవారు , టైలర్లు మొదలగు కళాకారులను ఈ పథకం కింద తీసుకురావాలన్నారు. సమావేశానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైఎస్ఆర్ క్రాంతి మహిళా సంఘ సభ్యులు ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఆదాయ మార్గాలను ఎంచుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని బిపిఎం ప్రసాద్‌రెడ్డి కోరారు. శ్రీ శక్తి భవన్లో జరిగిన శిక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, ప్రభుత్వ తరపున అందించే శ్రీనిధి, బిఐఎం వంటి పలు రకాల రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక వనరులను వినియోగించుకొని ఆదాయం పొందే మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. అప్పుడే జీవన విధానంలో మార్పు, కుటుంబంలో ప్రమాణాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ అమరావతి, ఎపిఎం గంగాధర్, సిసిలు భవానిశంకర్, బద్రి, ఆదిలక్ష్మి, తులసి, పాల్గొన్నారు,

శిక్షణ కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఓటరు రీసర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ నరసింహకుమార్

96 శాతం ఓటర్ల జాబితా పూర్తి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీలో బిఎల్ఓలు 96శాతం ఓటరు జాబితా పూర్తి చేశారని తహశీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. మండల పరిధిలో 2024 సంవత్సరం జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాలలో జరిగే ఓటరు రీసర్వేను తహశీల్దార్ స్వయంగా పరిశీలించి బిఎల్ఓలకు తగు సూచనలు, సలహాలు అందించారు. ప్రతి ఒక్క బిఎల్ఓ ఓటర్ జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయని వారు ఆధార్ లేదా దానికి సంబంధించిన 16 గుర్తింపు కార్డులు ఏదో ఒకటి తమ ఓటుకు అనుసంధానం చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసుకొని యెడల ఓటును తొలగిస్తారని చెప్పారు. మరణించిన వారి ఓట్లను ఎన్నికల కమిషన్ కొత్త నిబంధనల ప్రకారం పూర్తి వివరాలు తీసుకొని తొలగించడం జరుగుతుందని తెలిపారు. వీటి వివరాలను సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి రక్త పరీక్ష నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రక్తదానానికి దాతల బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం ఎంతో అవసరం అని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య అన్నారు. గురువారం సాయి డిగ్రీ కళాశాలలో ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో అపోలో డయాగ్నోస్టిక్స్ వారి ద్వారా ప్రతి ఒక్క విద్యార్థికి బ్లడ్ గ్రూప్ తెలియాలనే ఉద్దేశంతో అందరి విద్యార్థులకు బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అభాగ్యులు రక్తము లేక ప్రాణాలు కోల్పోతూ ఉన్నారని, రోడ్డుప్రమాదాలు, వివిధ రోగాలకు సంబంధించిన వారికి బ్లడ్ అనేది చాలా ముఖ్యమైందని, వారి ప్రాణాలు కాపాడుటకు రక్తదానం చేయుటకు సాయి డిగ్రీ కళాశాల ఎప్పుడు ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో అపోలో డయాగ్నోస్టిక్స్, కోడూరు బ్రాంచ్ మేనేజర్ రాజకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రామ్‌గణేష్, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల డైరెక్టర్. పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రస్తుతం సమాజంలో పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ గాయిత్రి అన్నారు. గురువారం శ్రీశారద హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా దూరంగా ఉంచాలన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అనేక విషయాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొనిఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సనత్‌కుమార్ పాల్గొన్నారు.

పునరావాస గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న పూల భాస్కర్

పునరావాస కల్పనలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నియో జకవర్గ ఇన్‌ఛార్జి పూలభాస్కర్ ఆరోపించారు. గురువారం ఆయన పులపుత్తూరు గ్రామంలో పర్యటించి వరద బాధితులకు ప్రభుత్వం నిర్మిస్తున్న పునరావాస గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు సంభవించి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తికావస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 50శాతం కూడా పూర్తి చేయలేదని అన్నారు. ఒక్కొక్కరికీ ఐదు సెంట్లు స్థలంలో ఐదు లక్షల నిధులతో ఇంటి నిర్మాణం చేపడతామని హామీనిచ్చి నేటికి రెండేళ్లు అవుతున్నా కొన్ని నిర్మాణాలు మాత్రం పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక కొందరు అప్పులు చేసుకుని సొంత నిధులతో నిర్మానాలు చేసుకొని అవస్థలు పడుతున్నారని తెలిపారు. సిఎం ఇచ్చిన హామీల మేరకు సర్వం కోల్పోయిన వరద బాధితులకు పునరావాస నిర్మాణాలు వెంటనే పూర్తి చేసి ఆదుకోవాలన్నారు.

రేపు తంబళ్లపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం గంటలకు ఎంపిపి అనసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. మండలంలో జరిగిన అభివృద్ధి, ప్రజాసమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సేవలు, తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.మండల ప్రత్యేక ఆహ్వా నితులు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన పూర్తి సమాచార నివేదికతో హాజరుకావాలని కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీ సమీపంలో ప్యాసింజర్ ఆటో,ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయని, ఈ ప్రమాదంలో జయమ్మ(52) తీవ్రంగా గాయపడిందన్నారు. గాయపడిన మహిళను హుటా హుటిన ప్రభుత్వాసుపత్రికి తరలిం చారని అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.